# జగత్తంతయు ఓంకార మయమే!

పెక్కు విద్యలు నేర్చిన ఒక్కడైన
సరస సద్గుణవంతుడై సాధు బుద్ధి
సత్యవర్తన ధర్మంబు శాంతి గుణము
గఱప నేర్చిన విద్యార్థికలడె యిలలో

నేటి విద్యలు తెలివితేటలనె పెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
వాటి విలువ యేటి పాలు కాదె

దివ్యాత్మ స్వరూపులారా!

జీవ జగత్తుకు ప్రకృతియే భావసారము. ప్రకృతి సారమే నేను. నీటియొక్క ప్రయోజనమే సస్యము. సస్యముయొక్క సారమే పురుషుడు. పురుషునియొక్క ప్రయోజనమే వాక్కు. వాక్కుయొక్క పటుత్వమే ఋక్కు. ఋక్కుయొక్క సౌందర్యమే సామము. సామముయొక్క సారమే ఓంకారము. ఓంకారము వినిపించునుగాని కనుపించదు. ఇది పరమాత్మునికి పర్యాయపదమే! ఓంకారములేని స్థానముగానీ, ఓంకారము వినుపించని క్షణముగాని, ఓంకారము వ్యాపించని జీవకణముగానీ జగత్తునందు లేదు. జగత్తంతయు ఓంకారమయమే. ఇట్టి ఓంకారమయమైన జగత్తునందు 'ఓం యిత్యేకాక్షరం బ్రహ్మ'. ఏకాక్షరమైన ఓంకారమే బ్రహ్మస్వరూపమని యీ బ్రహ్మతత్త్వము సర్వవ్యాపకత్వముగా భావించుచూ 'అయమాత్మ బ్రహ్మ', ఆత్మకూడను బ్రహ్మమయమే అని, బ్రహ్మకూడను ఆత్మయే అని మాండూక్యము చాటుతూ వచ్చింది. ఏతావాతా ఓంకారము, బ్రహ్మ, ఆత్మ యివి అభేదతత్త్వములు, అవినాభావసంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. యిట్టి ఆత్మను ప్రతి మానవుడు గుర్తించటము అత్యవసరము. ఆత్మయొక్క స్వరూపము ఏమిటి? ఆత్మవున్న ప్రదేశము యేమిటి? దీనియొక్క చిహ్నము యేమిటి, అనే విషయము ప్రతి

sri sathyasaivachanamrutam

మానవుడు అత్యవసరముగా గుర్తించాలి.

**విశ్వస్వరూపమే ఆత్మ స్వరూపము**

మానవుడు నిత్యజీవితములో నాలుగు అవస్థలు అనుభవిస్తున్నాడు. జాగ్రత, స్వప్నము, సుషుప్తి, తురీయము. జాగ్రదవస్థ అనగా మేలుకొనివుండుట. ఈ స్థితిలో ఆత్మ బహిర్ముఖమై వుంటుంది. కన్నులు రంగులు చూడగలుగుతుంటాయి. చెవులు శబ్దము వినగలుగుతూ వుంటాయి. నాలుక రుచులను చూడగలుగుతూ వుంటుంది. నాసిక సుగంధములను అనుభవిస్తూ వుంటుంది. ఈ విధముగా పంచభూతములయొక్క ప్రభావము నిత్యజీవితములోపల బహిర్ముఖమై తమ తమ కర్తవ్యములను నిర్వర్తిస్తూ వుంటున్నాయి. ఆత్మ వ్యక్తిగతము కాక సమిష్టితో అనుభవిస్తూవుంటుంది. ఆత్మ విశ్వముతో సంబంధమై వుండటంచేత యీ జాగ్రదవస్థలో వుండిన బహిర్ముఖమైన ఆత్మకు 'విశ్వుడు' అని పేరు పెట్టారు. అనగా విశ్వస్వరూపమే ఆత్మస్వరూపము. విశ్వమ్ విష్ణుస్వరూపమని భావించాలి. దీనినే భక్తి భావముతో 'హృషీకేశసేవనం భక్తి రుచ్యతే' అంటారు. జాగ్రదవస్థయందు ఆత్మవిశ్వవ్యాపకమైన రూపాన్ని ధరిస్తుంది.

**స్వప్నావస్థయందు ఆత్మకు 'తైజసుడు' అని పేరు**

రెండవది స్వప్నావస్థ. ఇక్కడ ఆత్మ అంతర్ముఖముగా వుంటుంది. నిద్రయందే కలలు కంటూ వుంటాడు. అయితే కర్మేంద్రియములు యీ స్వప్నావస్థయందు యేమాత్రముకూడను తమ తమ పనులు తాము చేయవు. అంతరింద్రియములు మాత్రమే యిందులో జాగ్రతగా వుంటాయి. ఇందులో కేవలము మనో బుద్ధులు మాత్రమే తమ తమ పనులను తాము చేస్తూ వుంటాయి. ఇది సమిష్టి స్వరూపమును విస్మరించి వ్యక్తి స్వరూపములో అతి జాగ్రతగా మెలుగుతూ వుంటుంది. ఒక రూమునందు పదిమంది పవళించి వుండినప్పటికి ఎవరి కల వారికేగానీ ఒకరికొకరికి యేమాత్రము సంబంధముండదు. స్వప్నావస్థయందు వ్యక్తిత్వమును మాత్రమే అనుభవిస్తుంది కానీ సమిష్టిని యేమాత్రము అనుభవించుటకు వీలుండదు. ఈ స్వప్నావస్థయందు కేవలము తేజస్వరూపమై వుండటంచేత ఆత్మకు స్వప్నావస్థయందు 'తైజసుడు' అని పిలుస్తూ



sri sathyasai vachanamrutam

వచ్చారు.

**సుషుప్తి స్థాయిలో ఆత్మ ప్రజ్ఞాతత్త్వముతోకూడి యుండుటచేత 'ప్రాజ్ఞుడు' అని పిలువబడుతుంది**

ఇంక సుషుప్తి. 'సు' అనగా మంచి, 'సుప్తి' అనగా నిద్ర. గాఢనిద్రకే 'సుషుప్తి' అని పేరు. ఈ గాఢనిద్రలో సూక్ష్మేంద్రియములుకూడను యేమాత్రము పని చేయవు. మనస్సుకూడను ఆత్మలో లయమై వుంటుంది. కనుక యింద్రియములయొక్క సంబంధము యేమాత్రము దీనికి వుండదు. కర్మేంద్రియములతోగానీ, జ్ఞానేంద్రియములతోగానీ దీనికి యేమాత్రము సంబంధము వుండదు. యీ సుషుప్తి స్థాయిలో ఆత్మ ప్రజ్ఞతో కూడి వుండటంచేత యితనికి 'ప్రాజ్ఞుడ'ని పేరు వచ్చింది.

ఇంక తురీయము. తురీయమనగా నాల్గవస్థానమని దీనికి అర్థము. ఇందులో జీవుడు దైవముతో లీనమై వుంటాడు. అందులో జీవత్వము దైవత్వముతో ఐక్యానుసంధానమును అనుభవిస్తుంది. కానీ, దేహబుద్ధితో చూచినప్పుడు యిది తమస్సుగా కనిపిస్తుంది. ఆత్మబుద్ధితో చూచినప్పుడు యిది కేవలము తన్మయత్వముగా వుంటుంది. తురీయస్థితిని మనము ఆత్మబుద్ధితో చూడాలి. అప్పుడే దీనియొక్క తన్మయస్థితిని మనము అనుభవించుటకు వీలవుతుంది. ఇట్టి తురీయస్థితినే 'సమాధి' అని పిలుస్తూ వచ్చారు. ఇదియే మానవుని పరమావధి. ఈ జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలు ఆత్మకు నాల్గుపాదములవంటివి.

అదే విధముగనే ఓంకారమునకు నాల్గు పాదములున్నవి. అకార, ఉకార, మకార, ఆమాత్రలు అనేవి నాలుగు. ఈ ఆమాత్రస్థితియే తురీయస్థితి అనికూడను భావిస్తూవచ్చారు. ఈ అకారమే వాఙ్మయమై జగత్తంతా వ్యాపించినటువంటిది. కనుకనే యిది విశ్వస్థాయికి చేరినది. కనుక దీనిని 'విశ్వుడు' అని చెప్పవచ్చును. కారణమేమనగా యిది శబ్ద బ్రహ్మముతోకూడినది. 'ఉ'కారమనేది ఉచ్చారణ. ఇది దివ్యమైన తేజస్సుతో కూడినది. ఇక 'మ'కారము ఓంకారములో కడపటి పదము. ఇది 'ప్రజ్ఞ'తో కూడినది. అకారము, ఉకారము, మకారము మూడింటియొక్క చేరికయే ఆమాత్రస్థితి అని పేరు పెట్టారు. దీనినే

srisathyasaivachanamrutam

ఓంకారము అన్నారు. ఈ నాలుగుకూడను ఓంకారమునకు నాల్గు పాదములు.

**ప్రపంచమంతయుకూడ బ్రహ్మమయమే!**

ఆత్మ అంటే ఏమిటి? ఆత్మ అనగా వాక్కు, శరీరము, ప్రాణము మూడింటియొక్క ఏకత్వమే! ఈ మూడింటియొక్క చేరికనే ఆత్మ. ఇందులో మనస్తత్త్వము దేహముతో కూడివుంటుంది. వాక్కు తేజోమయమైనదిగా వుంటుంది. మనస్సు అన్నమయమైనదిగా వుంటుంది. ఇంక, ప్రాణము రసమయమైనదిగా వుంటుంది. తేజోమయమైన వాక్కు అన్నమయమై దేహములో, ప్రాణమయమై రసముతో కూడివుంటుంది. దీనినే అష్టైశ్వరసంపన్నముగా యీ బ్రహ్మతత్త్వాన్ని వర్ణిస్తూ వచ్చాయి, ఉపనిషత్తులు.

**శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ**
**నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ**
**అష్టైశ్వర్యమయీ సదాశివమయీ శ్రీశివశక్తిసాయీమయీ**

ఈ ప్రపంచమునందు బ్రహ్మకాని పదార్థము ఒక్కటికూడను లేదు. ప్రపంచమంతయుకూడను బ్రహ్మమయమే. కనుకనే ఆత్మతత్త్వమనగా ఓంకారమనియు, బ్రహ్మమనియు, విశ్వవ్యాపకమైన తత్త్వమనియు మనము విశ్వసించవలసి వస్తుంది.

**వేదసారమంతయు మానవాకారమునందే లీనమై యున్నది**

వాక్కే ఋగ్వేదమనియు, మనస్సే యజుర్వేదమనియు, ప్రాణమే సామవేదమనియు చెబుతూవచ్చారు. కనుక, వేదసారమంతయు మానవాకారమునందే లీనమై వున్నది. ఆత్మకాని పదార్థము జగత్తునందు కానరాదు. శాశ్వతము, నిత్యము, సత్యమైన 'అస్తి, భాతి, ప్రియ' స్వరూపమే ప్రతీ పదార్థము. వీటినే సత్‌చిత్ ఆనందమనికూడను చెప్పడం జరిగింది. Being, awareness and bliss. ఈ తత్త్వమునందు మనము ఆత్మతత్త్వమును వెతకనక్కరలేదు. రూపనామములు కేవలము కల్పితమైనప్పటికి ఆ కల్పితమైన రూపనామములను ఆశ్రయించియే మానవుడు ఆత్మను విస్మరిస్తున్నాడు. ఇట్టి

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వమును విద్యచేతగాని, మరే విధమైన సాధనలచేతగాని గుర్తించుటకు సాధ్యముకాదు.

**అరువది నాలుగు విద్యలు అరుదారుగ నేర్చినట్టి ఆ నారదుడే**
**నిరవధిక శాంతి కనుగొని పరమానందము నాడు పొందడుగాదె**

నారదుడు నేర్వని విద్యలు లేవు. అలాంటి నారదునకు మధ్యమధ్య అశాంతి ప్రవేశించి అనేక విధములుగా అతనిని బాధిస్తూ వచ్చింది. చదువునకు సంస్కారమునకు చాలా వ్యత్యాసమున్నది. గ్రంథ పరిచయము కేవలము జగత్తునకు మాత్రమే వినియోగపడగలదు. పుస్తకములంతాకూడను మస్తకములోనికి మార్చుకోవచ్చును. కానీ ఆ మస్తకాన్ని ప్రాక్టికల్‌లో, అనుభూతిలోకి తెప్పించుకోవాలి. కనుకనే యీ సందేహ నివారణార్థమై తాను ఒక ఋషి దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఆ ఋషి యితనిని "అయ్యా! నీయొక్క విద్యల రుజువేమిటి, నీ క్వాలిఫికేషన్ యేమిటో", చెప్పమని ప్రశ్నించాడు. ఆ గురువే సనత్కుమారుడు. ఈ సనత్కుమారుడు ప్రశ్నించిన ప్రశ్నకు నారదుడు తన విద్యల ప్రవీణతను ప్రదర్శిస్తూ వచ్చాడు. విన్నంతవరకు విన్నాడు, సనత్కుమారుడు. కడపటికి పెదవి విరిచాడు, 'ఇంతేనా నీ విద్యల సారము', అని. అతడు విన్నంత వరకు నారదునియొక్క గర్వము మితిమీరిపోతూ వచ్చింది. "ఆహా! నా విద్యలయొక్క ప్రావీణ్యతను సనత్కుమారునివంటి మహాగురువు వింటున్నాడు కదా", అని ఆనందించాడు. నారదుడు ముగించిన తరువాత సనత్కుమారుడు ప్రశ్నిస్తున్నాడు, "నీ విద్యలన్నీ నామమాత్రములే", అన్నాడు. అప్పుడు "మహర్షీ! నామమునకు మించినది యీ జగత్తునందు కలదా?" అని ప్రశ్నించాడు, నారదుడు. "పిచ్చివాడా! నామమే ప్రధానమని భావిస్తున్నావు, భ్రమిస్తున్నావు. కాదు, నామముకంటె గొప్పది వాక్కు", అన్నాడు సనత్కుమారుడు. ఇంకా "వాక్కుకంటె గొప్పది మనస్సు, మనస్సుకంటె గొప్పది సంకల్పము, సంకల్పముకంటె గొప్పది చిత్తము, చిత్తముకంటె గొప్పది బలము, బలముకంటె గొప్పది పృధ్వి, పృధ్వికంటె గొప్పది అన్నము, అన్నముకంటె గొప్పది జలము, జలముకంటె గొప్పది తేజస్సు, తేజస్సుకంటె గొప్పది ఆకాశము, ఆకాశముకంటె గొప్పది శృతి, శృతికంటె గొప్పది ప్రాణము; ఆ ప్రాణమే తల్లి,

sri sathyasaivachanamrutam

ప్రాణమే తండ్రి, ప్రాణమే గురువు, ప్రాణమే బంధువు, సర్వము ప్రాణమయమే!" అని బోధించాడు. ఈ ప్రాణమే రసస్వరూపము. సర్వరసముల సారము. దీనినే ఉపనిషత్తులందు 'రసోవైసః' అన్నారు. యీ ప్రపంచమంతయుకూడను నామముతోకూడినది. రూపనామములు రెండును కల్పితములే! ఈ కల్పితములను త్యజించినప్పుడు శాశ్వతము మనకు తెలిపోతుంది. యీ రూపనామములతోకూడిన జగత్తుకూడను అస్తిభాతిప్రియం. అనగా సత్‌చిత్ ఆనందములతో కూడినదే. కనుక ఓంకారములేని జగత్తుగాని, వస్తువుగాని, బ్రహ్మములేని వస్తువుగాని, పదార్థముగాని, ఆత్మలేని వస్తువుగాని, పదార్థముగాని యీ జగత్తునందు కానరాదు.

**అనేకత్వములోని యేకత్వమును గుర్తించుటకు మనము ప్రయత్నం చేయాలి**

మన తత్త్వమును మనము గుర్తించటానికి ప్రయత్నము చేయటమే సాధన. తన వునికిని తాను గుర్తించి వర్తించటమే మానవుని ప్రధానమైన కర్తవ్యము. కనుపించుచున్నవన్నీకూడను మిథ్యయే. దీన్ని ఆధారము చేసుకున్నదే సత్యము. ఈ మిథ్యయందుకూడను సత్యమున్నది. సత్యమునందుకూడను మిథ్య లీనమై వున్నది. అయితే సత్యమునందు మిథ్య, మిథ్యయందు సత్యము విచారించటము మాత్రమే కాదు, మనయొక్క ప్రధాన కర్తవ్యము, గమ్యము. సత్యమునుండి సత్యమును గుర్తించాలి. ఇదే ప్రధానమైన సాధన. ఈ సాధనకు సర్వత్ర వ్యాపించిన దైవత్వమును మనము విశ్వసించాలి. ప్రతిమానవునియందు నివసించునది, ప్రకాశించునది, ప్రకటించునది ఒక్కటే భగవత్ తత్త్వము. కనుక, అనేకత్వములోని యేకత్వమును మనము గుర్తించటానికి ప్రయత్నం చేయాలి. ఆత్మ అనగా ప్రత్యేకమైన ఒక ప్రదేశమునందు మనము గుర్తించటానికి వీలుకాదు. సర్వత్రా నిండినది. అనగా వాక్కు, మనస్సు, ప్రాణముయొక్క చేరికనే! మనస్సు కేవలము అన్నమయమైనది. మనము ఎట్టి ఆహారమును భుజింతుమో మనస్సు అట్టి తలంపులతో కూడివుంటాది. కనుక, మనస్సు అన్నమయమైనది. యీ అన్నమయమైన మనస్తత్వాన్ని వాక్ మయమైన దానితో సంబంధము కలిపి, తద్వారా ప్రాణమయముతో యేకము చేసినప్పుడు ఆత్మస్వరూపాన్ని దర్శించగలము. అనగా మూడింటియొక్క

sri sathyasai vahini amrutam

యేకత్వమే యీ ఆత్మస్వరూపము. GOD అనే మూడు అక్షరములు చేర్చినప్పుడు GOD (భగవంతుడు) అని మనము యేవిధముగా అనుకుంటున్నామో, అదే విధముగా వాక్+మనసు+ప్రాణము= ఆత్మ అని భావించాలి. ప్రపంచమంతయు కూడినది matter. యీ matter ను matter గానే వుంచకూడదు. దీనికి నిత్యమైన, సత్యమైన, తత్త్వాన్ని చేర్చాలి. జగత్తు అనగా యేమిటి? Matter+Being= Nature. ప్రపంచమనగా ప్రత్యేకముగా లేదు. ఈ ప్రపంచములోని మేటర్‌తో అనగా పదార్థములతో, ఆత్మ కూడివుంటున్నాది. 'సత్' అనేది లేకుండా అనిత్యమైన ప్రకృతి మనకు కానరాదు. మార్పు చెందునటువంటి పదార్థములో మార్పు చెందనటువంటి దైవత్వము చేరి వుంటున్నది. దీనినే సైంటిస్టులంతాకూడను matter and energy అన్నారు. Energy అనగా శక్తి అని. ప్రతి పదార్థమునందు దానికి సంబంధించిన శక్తి వుంటున్నది. కనుక energy లేని matter లేదు. అదే విధముగనే ఆత్మలేని స్థానము, ఆత్మలేని రూపము, ఆత్మలేని పదార్థము జగత్తునందు లేదు. కనుక యిట్టి అనంతమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించినప్పుడే సర్వము మనకు అర్థమవుతుంది.

**మానవుల రూప, నామములు వేరుగా ఉన్నా అందరియందు ఆత్మతత్త్వము ఒక్కటిగానే ఉంటున్నది**

అంతా ఒక్కటే! నీవు వేరు, నేను వేరుకాదు. దేహములు వేరుగా వుండవచ్చును. పేర్లు వేరుగా వుండవచ్చును. కానీ అందులో వుండిన దివ్యశక్తి ఒక్కటే! ఇక్కడ పెద్ద లైటు వుంటున్నది. కానీ అక్కడ ఓంకారముతో వెలుగుతూ వుంటున్నాది లైటు. ఇక్కడ చిన్న చిన్న బల్బులు అంతా వెలుగుతున్నాయి. అక్కడ పెద్ద పెద్ద tube lights వెలుగుతున్నాయి. ఆ tube యొక్క రూపము, ఆ tube యొక్క నామము ప్రత్యేకముగా వుండి, ఈ దీపముయొక్క రూపము, నామము వేరుగా వుంటున్నాయి. ఆ దీపమునకు రూపము, నామము వేరుగా వుంటున్నాయి. కానీ అన్నింటియందు కరెంటు ఒక్కటే! అదే విధముగనే మానవునియొక్క ఆకార, రూపములు ప్రత్యేకముగా వుండవచ్చును. భిన్నభిన్నముగా వుండవచ్చును. కాని అందరియందు దైవత్వమనే ఆత్మతత్త్వము ఒక్కటిగానే వుంటుండాది. బల్బులలో colours

sri sathyasai vachanamrutam

ప్రత్యేకముగా వుండవచ్చును. Voltage ప్రత్యేకముగా వుండవచ్చును. ఇంతమాత్రముచేత మనము భేదములు పాటించరాదు. లోపల వున్నశక్తి తత్త్వము ఒక్కటే! అదే ఆత్మ, అదే బ్రహ్మము, అదే ప్రణవము. బ్రహ్మవేరు, ఆత్మవేరుకాదు. దీనికి మరొక ఉదాహరణము. ఉదయించే సూర్యునియందు మూడు రంగులుంటున్నాయి-ఎఱుపు, తెలుపు, నలుపు. సూర్యుడు ఉదయించక పూర్వము అంతా నలుపుగా వుంటుంది. అప్పుడు చీకటి అంటాము. క్రమేణా సూర్యుడు ఉదయించే సమయములో కొంచెము ఎఱ్ఱని రంగుగా మారుతూ వస్తుంది. సూర్యోదయమై పూర్తిగా ప్రకాశించినప్పుడు తెల్లని రూపము ధరిస్తుంది. అదే విధముగా ఆత్మ ఒక స్థాయియందున్నప్పుడు ఒక్కొక్క రూపాన్ని ధరిస్తూ వుంటుంది. జాగ్రతలో ఒక రూపమును, స్వప్నములో మరొక రూపమును, సుషుప్తిలో మరొక రూపమును ధరించినట్లుగా సూర్యుడు ఉదయించక పూర్వము, ఉదయించేసమయములో, పూర్తి ప్రకాశించే సమయములో యీ రంగులు యే విధముగా మారుతాయో, ఏ విధముగా ఒకే సూర్యుడు ఉంటున్నాడో, అదే విధముగా ఆత్మ ఒక్కటే అయి వుండినప్పటికిని వివిధ స్థాయిలందు, వివిధ కాలములందు, వివిధ స్థితులయందు దాని రూపములు మారుతుంటాయి. మనము సులభముగా అర్థము చేసుకోవలెనన్న పుట్టినప్పుడు చిన్న బిడ్డ child; పది సంవత్సరములయ్యేటప్పటికి వానిని boy అంటున్నాము; వాడే 30 years, 35 years వచ్చేటప్పటికి man అంటున్నాము; అతనే 75 years, 80 years వచ్చినప్పుడు grand father అంటున్నాము. వ్యక్తి ఒక్కడే అయినప్పటికిని, అవస్థలచేత రూపనామములచేత అనేకమైన మార్పులు కలుగుతున్నాయి. ఇదే జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలు. ఈ మూడు రకములైన తత్త్వములు, మన నేత్రములందే కనుపిస్తున్నాయి.

**ఆత్మయే లేకుండిన మనమే లేము అను విశ్వాసమును దృఢపరచుకోవాలి**

వాక్కు, మనస్సు, ప్రాణము. వాక్కు తేజోవంతముగా వుంటుంటాది, అన్నమయమైనది కనుక నల్లనిరంగుగా వుంటుంది. మనస్సు ఎఱ్ఱని రంగుగా వుంటుంది. ప్రాణము తెల్లని రంగుగా వుంటుంది. అదే మన కన్నులందు కొనభాగమునందు ఎఱ్ఱని రంగుగా

sri sathyasai vahini amrutam

వుంటుంది. మధ్యలో వుండిన గ్రుడ్డు నల్లని రంగుగా వుంటుంది. దానికి చుట్టూ వుండినది తెల్లని రంగుగా వుంటుంది. కనుకనే, యీ మూడింటియొక్క ఆకారములు మననేత్రమునందే మనము చూడగలుగుతున్నాము. మన దృష్టియందే తానుండి మనకన్నీ చూపుతూ వుంటున్నాడు, పరమాత్ముడు. అందులోనే మన ప్రతిబింబమును మనము చూడగలుగుతూ వుంటున్నాము. ప్రతిబింబమనే జీవతత్త్వమును బింబమనే నేత్రమునందు మనము ఏకత్వము గావించినప్పుడు, అదే ఆత్మతత్త్వము. ఆత్మతత్త్వమనగా యెక్కడో మనము విచారించనక్కరలేదు. పెద్ద పెద్ద గ్రంథములు మనము చదువనక్కరలేదు. ఆత్మయే లేకుండిన మనమేలేము అనే విశ్వాసమును మనము ధృడపరచుకోవాలి.

### నీ యందున్న ఆత్మయే అందరియందు ఉంటున్నది

దీనినే మనము అప్పుడప్పుడు చెప్పుకుంటున్నాము. The one you think you are. బాహ్యదృష్టిచే, బహిర్ముఖమైన జాగ్రత దృష్టిచే నీవు చూడటంచేత The one you think you are. మనము కొంత అంతర్ముఖములో దృష్టిని ప్రవేశపెట్టినప్పుడు, The one others think you are. ఈ రెండింటిని విస్మరించి మనయొక్క దృష్టిని మరింత లోతుకు పంపించినప్పుడు The one you really are అదే ఆత్మదృష్టి. నీవు దేహాన్ని చూడవద్దు, మనస్సును చూడవద్దు, నీయొక్క ఆత్మను చూడు! నీయందున్న ఆత్మయే అందరియందు వుంటున్నాది. సర్వత్ర యీ ఆత్మతత్త్వాన్ని గుర్తించుకుంటే యింక రాగద్వేషములకు యేమాత్రము అవకాశము వుండదు. అప్పుడే మనము ఆశించిన సత్యవాక్కు, ధర్మప్రవర్తన, శాంత చిత్తము, ప్రేమతత్త్వము యీ నాల్గింటి యేకత్వముచేత అన్ని విధముల ప్రశాంతి మనకు యేర్పడుతుంది. అదే అహింస. కనుక, మొట్టమొదట మనము యీ సత్యాన్ని గుర్తించినప్పుడు యితరులకు చెప్పుటకుకూడను సాధ్యమవుతుంది.

### భారతదేశము వెలుపల మానవతా విలువల బోధనా కార్యక్రమాన్ని ప్రారంభంలో సాయి సంస్థల ద్వారానే నిర్వహించాలి

ఈ సమావేశములో పాల్గొన్న అధ్యాపకులు ముప్పై దేశములనుంచి వచ్చారు. ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, నేపాల్, రష్యా, సౌత్ఆఫ్రికావంటి దేశములనుండి వచ్చారు. వీరిలో కొన్ని



sri sathyasaivachanamrutam

విధములైన సందేహములు ఉండి, వాటి నివృత్తికొరకు స్వామికి చీటీ వ్రాసి పంపించారు. మా రష్యాలోపల యీ విధమైన ప్రచార, ప్రబోధలు సల్పుటకు కొంచెము కష్టమవుతుందని; ఆస్ట్రేలియాలో అనేక రకములైన అలజడులు వుండటంచేత అక్కడకూడను యీ మానవతా విలువలు యే విధముగా మేము అభివృద్ధి గావించాలి అని, వారిలో కొన్ని సందేహములు వచ్చాయి. నా వుద్దేశ్యమేమనగా రష్యా, చైనా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఇటలీ ఇలా ఏ దేశమైనప్పటికి అందరూ మానవజాతికి చెందినవారే! కనుక, ప్రతివ్యక్తికూడను యీ మానవత్వం గుర్తించటము అత్యవసరము. అయితే, బాహ్యప్రపంచమునందు కొన్ని విధములైన ఆటంకములు కలుగుతూ వుంటాయి. ఉదాహరణకు, ఆస్ట్రేలియా తీసుకోండి. ఈ ఆస్ట్రేలియాలోపల యింగ్లీషుభాషగాని, చరిత్రగాని, భూగోళశాస్త్రముగాని వీటిలోని విషయములు కేవలము వుద్రేకముతో కూడివుంటాయి. టెక్స్టుబుక్‌లంతాకూడను సరిగా చెప్పాలంటే violence తో నిండిన పాఠ్యాంశములతో వుంటాయి. అటువంటి వాతావరణములో ప్రశాంతమైన యీ మానవతా విలువలను ప్రవేశపెట్టటము ప్రథమములో కొంచెం కష్టముగా వుంటుంది. వారి హృదయాలంతా కేవలము క్రోధముతోను, ఒక విధమైన అలజడితోను నిండి వుంటూంటాయి. విద్యార్థులలో ప్రతిదానికి వుద్రేకము ఎక్కువగా వుంటుంటాది.

కనుక, యీ సమయములోపల యీ మానవతా విలువలను ప్రభుత్వముతో యేమాత్రము సంబంధములేకుండా భక్తులు మాత్రమే బాలవికాస్‌నందు లేక భక్తుల సమూహమునందు క్రమక్రమేణా అభివృద్ధి గావించుకుంటూ రావటం మంచిది. ప్రారంభములో రష్యా, సౌత్‌ఆఫ్రికా, ఫ్రాన్సు, ఆస్ట్రేలియావంటి దేశములలో ప్రభుత్వముతో సంబంధము పెట్టుకొనకుండా ప్రత్యేకముగా మనసంస్థలలోనే యీ మానవతా విలువల బోధనా కార్యక్రమాన్ని బాలవికాస్ ద్వారా start చేసి క్రమేణా దీనిని వ్యాపింప చేసుకోటం మంచిది. క్రమక్రమేణా వారే దీనియొక్క సత్యాన్ని గుర్తించి దీనిని ఆశిస్తూ వస్తారు. Sathya Sai Education in Human Values అంటే యిది భారతదేశములో ప్రత్యేకముగా ప్రారంభించిన సంస్థయేమో అనుకుంటారు. కనుక, ఇతర దేశములలో సమాజము, ప్రభుత్వముకూడా క్రమేణా దీనిని అర్థము చేసుకునేవరకు దీనిని మన సంస్థలద్వారానే

srisathyasaivahini.org

కొంతవరకు అభివృద్ధి గావించుకోటం వుత్తమం. నేపాల్ నుంచి వచ్చిన టీచర్సు అందరికి నేపాల్ ప్రభుత్వము యీ విధమైన Human Values కు తగిన అవకాశము యిస్తుందో యివ్వదో అనే అనుమానముతో వారు స్వామిని ప్రశ్నిస్తూ వచ్చారు. ఇంకా కొంతమంది చిన్న చిన్న పిల్లలకు ఈ మానవతా విలువలను ఏ విధముగా బోధించాలి, వారికి సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస ఇటువంటి భావములు ఏ విధమైన మార్గములో మేము అందించాలి అని సందేహముతో వ్రాస్తూ వచ్చారు.

**సత్యమైనప్పటికి అది ప్రియముగాను, హితముగాను, ఇతరులకు బాధ కలిగించని రీతిలో చెప్పాలి**

ముఖ్యముగా అధ్యాపకులు యీ సత్యమును తాము ఆచరణలో పెట్టటానికి మొట్టమొదట ప్రయత్నించాలి. 'చూచినది చూచినట్టుగా, విన్నది విన్నట్టుగా, చెప్పినది చెప్పినట్టుగా, చేసినది చేసినట్టుగా చెప్పటం సత్యము' అని యీ ప్రాకృతమైన జగత్తునందు విశ్వసిస్తూ వుంటారు. కానీ యిందులో కొంత ప్రమాదము ఎదురవుతుంది. ఈ విషయాన్నే అనేక విధములుగా భగవద్గీతయందుకూడను గీతాచార్యుడు చెప్పాడు, 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచైవ' అని. సత్యమైనప్పటికిని అది ప్రీతిగాను, హితముగాను, యితరులకు బాధకలిగించని రీతిలోను చెప్పాలి. దీనినే 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియమ్' అని చెప్పారు. ఒక చిన్న ఉదాహరణ వుంటుండాది. ఒకరు సరిగా నడవలేని పరిస్థితిలో వుంటుంటాడు, కాలు పోలియోనో యేదో కొంచెం వచ్చి నిశ్శక్తితో వుంటాది. సరిగా నడచలేడు. యిది సత్యమే! అయితే, కాలు లేనిది సత్యమని, నడచటం చేతకాదన్నది సత్యమని, 'ఓ కుంటివాడా! రా!' అంటే వారికి యెంత బాధ కలుగుతుంది? కనుక యీ సమయములోపల సత్యమైనప్పటికిని అతనిని 'Oh! brother, come on!' అని పిలుస్తాం. యీ రకముగా మనము పిలువవచ్చుగాని, యిది సత్యమని 'ఓ కుంటివాడా రా, ఓ గుడ్డివాడా రా!' అంటే వారికి చాలా బాధ కలుగుతుంది. ఇది సత్యమైనప్పటికిని దీనిని యీ రకముగా మనము వుపయోగించరాదు. ఒకరికి ప్రియము కదా అని, వానిని అసత్యముతో వర్ణించి పైకి ఎత్తరాదు. ఈ సత్యాసత్యములకు

sri sathyasai vachanamrutam

రెండింటికి కొంచెం సందిగ్ధావస్థ కలిగినప్పుడు నీవు కొంతవరకు silent గా వుండటం మంచిది. కనుక, పిల్లలకు యీ సత్యము ఏ విధముగా బోధించాలంటే 'నాయనా! సత్యమనేది భగవత్ స్వరూపము. ఎలాంటి పరిస్థితులయందు యితరులను బాధించకు. వున్నది వుండినట్లుగా నీవు చెప్పటంలోకూడను కొంచెం ముందు, వెనుక యోచన చేసుకొని వుపయోగపెట్టుకోవాల'ని చెప్పాలి. సత్యము ప్రారంభములో కొంతవరకు కష్టము కలిగిస్తుంది. కానీ, క్రమక్రమేణా అది మనకు సహజమైపోతుంది. నిజంగా సత్యాన్ని విచారిస్తే, యిది మూడు కాలములకు అతీతమైనది. ఈనాడు మనము చెప్పేది సత్యముగా మనము భావిస్తున్నాము. కాదుకాదు, యిది నిజమని మాత్రం చెప్పవచ్చు. ఇప్పుడు నేను చూచినప్పుడు ఒక వ్యక్తి టోపీ వేసుకున్నాడు, స్వెట్టరు ధరించాడు. కానీ, రేపటిదినము అతడు టోపీ తీసివేయవచ్చు, చలిలేదని స్వెట్టరుకూడా తీసివేయవచ్చు. 'కాదు, కాదు; అతను టోపీ ధరించి స్వెట్టరు వేసుకున్నాడు; నేను చూచాను', అంటే అది సత్యము కాదు. అది నిజము మాత్రమే! తాత్కాలికముగా నీవు చూచినప్పుడు ఏద్రస్సులో వున్నాడో దానిని నిజమంటారు. సత్యమంటే అదికాదు. భూతభవిష్యత్ వర్తమాన కాలములందు ఒకే రూపాన్ని ధరించినది సత్యము. సత్యము రెండు రకములుగా మనము జగత్తులో అనుభవిస్తున్నాము. దేహబుద్ధితో అనుభవించే సత్యము ప్రాపంచిక సత్యము. ఆత్మబుద్ధితో అనుభవించే సత్యము దైవ స్వరూపము. కనుక పిల్లలకు మొదట్లో యీ దేహబుద్ధితో సంబంధమైన సత్యమును మనము బోధిస్తూరావాలి.

ఇంక South Africa లోపల యీ education in Human Values అనే దానికి కొన్ని పరిస్థితులవల్ల యిప్పుడు వాతావరణము కొంచెం విరుద్ధముగా వుంటున్నాది. కనుక, మనము యీ లోపల ప్రభుత్వముతో సంబంధము లేకుండా మన భక్తులకు బాలవికాస్‌కు సంబంధించిన దానిని అభివృద్ధి గావించుకోటం మంచిది. కొంతమంది అధ్యాపకులు, 'యీ బాల బాలికలకు యే వయస్సువరకు coeducation పద్ధతిలో పాఠములు చెప్పటం మంచిది?' అని ప్రశ్నించారు. ఈ coeducation అనేది మన Sathya Sai Balvikas నందుగాని Human Values Programme లో గానీ నా వుద్దేశ్యము ప్రకారము 5 సం॥లనుండి 12 లేక 14 సంవత్సరములకు మాత్రమే పరిమితం చేసి బోధించటం

sri sathyasai vacharamrutam

మంచిది. అందునా యీ బాలవికాస్ టీచర్సులో చాలావరకు స్త్రీలు అధికముగా వుండటంచేత, యీ పెరిగే పిల్లల పరిస్థితులను వారు చక్కదిద్దటానికి సాధ్యముకాదు. కనుక, 12 లేక 14 సంవత్సరములు దాటిన తరువాత మగపిల్లలు వేరు, ఆడపిల్లలు వేరు చేసి మగపిల్లలకు మగవారు, ఆడపిల్లలకు ఆడవారు బోధించటం మంచిది. పెరిగే మగపిల్లలు ఆడవారి మాటలను లక్ష్యము చేయరు. వారంటే భయముకూడా వుండదు. కనుక, యీ వినయ, భయ, విశ్వాసములలో భయముకూడను అవసరమే! కనుక, మగ అధ్యాపకులదగ్గరనే యీ పిల్లలను పెట్టి కొంతవరకు వీరికి అభ్యసింప జేయటం మంచిది.

ముఖ్యముగా ఈ కార్యక్రమంలో అధికముగా సందేహపడే విషయములలో ఒకటి వుంటున్నాది. అది ఏమిటనగా 'మేము యేవిధముగా బోధించాలి?' అని. కొంతమంది అంగవికలులుగా వుంటారు. తెలివితక్కువ పిల్లలుగా వుంటారు. ఇలాంటి పిల్లలకు మేము యే విధముగా బోధించాలి అని ప్రశ్నిస్తూ వచ్చారు. తెలివితక్కువ పిల్లలకు మనము యే రీతిగా బోధించాలనే ప్రశ్న వేయటము వారి తెలివితక్కువే, అని నా వుద్దేశ్యము. తెలివి కలిగినవారే ఈ అంశములను అర్థము చేసుకోలేకపోయినప్పుడు తెలివిలేనివారికి బోధించి ప్రయోజనమేమిటి? కనుక మొట్టమొదట యీ తెలివితేటలు కల్గిన బాలబాలికలలో ఈ బోధనా కార్యక్రమాన్ని మనము అభివృద్ధిపరచుకొందాము. తెలివితేటలులేని బిడ్డలకు చక్కగా వారికి వుత్సాహకరముగా చిన్న చిన్న కథలుగా భగవత్ చరిత్రలను బోధించటానికి ప్రయత్నించాలి. ఈ అంగవికలులైన బిడ్డలకు, తెలివితక్కువ బిడ్డలకు వారు ఆ అవకర స్థితిని మరచిపోయేలా కథలు బోధించాలి. "నాయనా! నీ అంగవైకల్యమునకు నీవు యే మాత్రము తించించనక్కరలేదు. దైవ సృష్టిలో యిదికూడను ఒక కారణ నిమిత్తమై ఏర్పడినద"ని చక్కగా వారికి వుత్సాహ ప్రోత్సాహములను అందించే చిన్న చిన్న కథలుగా చెప్పి వారియందు భగవద్విశ్వాసము అభివృద్ధిపరచటానికి కృషి చెయ్యాలి. భారతీయుల చరిత్రలయందు సాధుసంతులలో అనేకమంది ఆదర్శవంతమైన జీవితాల్ని అనుభవించుతూ వచ్చిన గాథలున్నాయి. భగవంతుని ప్రేమించి, అనేక విధములుగా ప్రార్థించి ఆయనను పొందే నిమిత్తమై సాధనలు సల్పినవాడు, సూరదాస్. ఒకానొక సమయములో కృష్ణుడు ప్రత్యక్షమై "సూరదాసూ! నన్ను చూడాలనుకుంటున్నావా! నీకు

srisathyasaivachanamrutam

కన్నులు లేవు, కన్నులిచ్చేదా?" అని ప్రశ్నించాడు. అందుకు సూరదాసు "కృష్ణా! యింకా నన్ను మాయలో ముంచుతున్నావా? యీ చర్మచక్షువులతో చూచే చూపు నాకు వద్దు. అంతర్ముఖమైన జ్ఞానచక్షువు నాకు ప్రసాదించమ"ని కోరాడు. "కన్నులున్నవారు ఎన్నికోట్లమంది లేరు? వారు నిన్ను చూస్తున్నారా? ఈ ప్రపంచములో శ్రోత్రములున్నవారు యెన్నికోట్లమంది లేరు? వారు అందరు నీ మురళీ గానమును వింటున్నారా?" అని ఈ విధముగా అడుగుతూ వచ్చాడు కృష్ణుని, సూరదాస్.

**కన్నులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన**
**నీమూర్తి దర్శింపనేరరైరి**
**చెవులుండి చేటలై అతి మనోహరమైన**
**నీ గానమాలింప నేరరైరి**

"సర్వస్వము నీవై వుండగా నేను కోరేది యేమిటి? నాకు యీ నేత్రములు అక్కరలేదు. నిరంతరము నీ సత్య, నిత్యమైన తత్త్వమును, నీ హృదయమును, నీ ప్రేమను, నీయొక్క ఆనందాన్ని అనుభవించే నేత్రాన్ని నాకు అందించమ"న్నాడు. కనుక, నేత్రములులేని పిల్లలకు మనము యీ విధముగా బోధిస్తూ రావాలి. "నాయనా! వున్నారు. ఎంతోమంది కోట్లమంది వుంటున్నారు, నేత్రములు కలిగినవారు. వాళ్లవల్ల యేమి జరుగుతుండాది? కాదు, కాదు. నీవు అంతర్దృష్టిని అభివృద్ధిపరచుకో! దైవత్వమును దర్శించటానికి ప్రయత్నించు", అని ఆ పిల్లలకు వుత్సాహప్రోత్సాహములు అందిస్తూ రావాలి. కనుక అధ్యాపకులు యేయే స్థాయిలలో, ఏఏ వ్యక్తికి ఏఏ పరిస్థితులయందు, ఏ విధముగా బోధించాలనే విషయము తప్పక గుర్తించి వారి తెలివితేటలను కొంచెము వుపయోగపెట్టి బోధించటానికి ప్రయత్నించాలి.

**ఈనాడు ఆకార మానవులే కన్పిస్తున్నారుగాని, వారిలో మానవత్వము ఏమాత్రము లేదు**

నిజముగా యీనాటి పరిస్థితిలోపల Education in Human Values చాలా అవసరమైనది. మానవుని ఆకారము కనుపించుచున్నదిగానీ మానవత్వము యిందులో యేమాత్రము కనుపించుటలేదు. ఈనాడు ప్రారంభించిన Education in Human Values

అనే కార్యక్రమం ప్రాణ సమానము, ప్రపంచానికి. ఎడారిలో దాహముతో తపించే వ్యక్తికి చల్లని పానీయము చిక్కినప్పుడు యెంత ఆనందమును అనుభవించునో అదే విధముగనే యీనాడు ప్రపంచములోపల శాంతి భద్రతలులేక, మానవత్వము నిర్మూలమైపోయి కేవలము దానవత్వముగా ప్రవర్తించే యీ సమయమునందు యీ మానవతా విలువలు అత్యవసరముగా అందించాలి. కనుక యీ సమావేశము అంతా అయిన తరువాత మీ మీ దేశములకు వెళ్లి దీనియొక్క విశిష్టతను, దీనియొక్క పవిత్రతను, దీనియొక్క అవసరాన్ని అనేకమందికి మీరు అందిచ్చి, వారిని యీ మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నంచేయాలి. ఇదే నిజమైన సేవ. ఇదే నిజమైన భగవత్ తత్త్వము. తనను తాను తరింపచేసుకోటం గొప్పతనముకాదు. తోటి మానవుని తరింపజేయటానికి తగిన ప్రయత్నం చేయటమే నిజమైన నిష్కామ కర్మ. క్రమక్రమేణా ఈ మానవతా విలువల బోధనా కార్యక్రమాన్ని కాలేజీలలో ప్రవేశపెట్టి కాలేజీ విద్యార్థులు, విద్యార్థినులకుకూడను యీ విధమైన శిక్షణ యివ్వటానికి కృషి చెయ్యండి. ప్రపంచములో అన్ని దేశాలవారికికూడను ఒక్క ప్రశాంతి నిలయమునందుమాత్రమే తరిబీదు ఇవ్వటం కష్టంగా వుంటుంది. మీమీ దేశములనుంచి ప్రశాంతినిలయమునకు ఒక పర్యాయము రావాలంటే ముప్పై వేలు, నలభై వేలు ధనవ్యయమవుతుంది. కనుక నా వుద్దేశ్యమేమనగా ఆయా దేశములలోపలనే యీ Education in Human Values conference అక్కడక్కడ పెట్టుకొని తద్వారా దీనిని అభివృద్ధి గావించటానికి తగిన కృషి చేయటం మంచిది. యిక్కడనుండి పోయే ప్రతి అధ్యాపకుడుకూడను కొంతమంది అక్కడ చేరిన మిగిలినవారికి యీ ప్రబోధలను అందించి, తద్వారా వారికి వుత్సాహప్రోత్సాహములనందించి కాన్ఫరెన్సులు ప్రారంభించటం అత్యవసరము. ఇంక మిగిలిన అంశములన్నీ ఆ కమిటీవారు అనగా Education in Human Values కమిటీవారు అనేక విధములుగా నిర్ణయించారు. దానిని తు, చ పాటించి తద్వారా మీరు యీ Human Values అనే దానిని విశ్వవ్యాప్తి గావించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 30-12-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam